# అసలు సంగతి!

— కృష్ణ

మా దగ్గర బంధువుల ఇంట్లో పెళ్ళి అయితే పిల్లల్ని తీసుకుని విజయవాడ వచ్చాను. మా వారికి సెలవు లేక పెళ్ళికి రాలేదాయన.

ఆరోజు పగలు పన్నెండు గంటలకు లగ్నం. ఉదయం అందరం స్నానాలు చేస్తున్నాము. స్నానాల హడావిడి. మా ముగ్గురు అమ్మాయిలకు స్నానం చేయించాను. నేనుకూడా స్నానంచేసి విడిదిలోంచి వస్తున్నాను.

మా దూరపుబంధువు బామ్మగారు ఎదురయ్యారు. "అమ్మాయ్ నీళ్ళోసుకున్నావా?" అన్నారామె కుశల ప్రశ్నలయ్యాక.

"అవునండి" అన్నాను. ఆవిడ వెళ్ళిపోయింది.

పెళ్ళి అయ్యాక ఆ రాత్రి ఊరేగింపు వగైరా అన్నీ అయ్యాయి. అందరం డాబామీద జంపఖానాలు వేసుకుని పడుకున్నాం. మా పెద్దక్కయ్య నా ప్రక్కనే పడుకుంది.

"ఏమే ఆ శుభవార్త మాకు చెప్తే నీ నోటి ముత్యాలు రాలిపోతాయా! బామ్మగారికి చెప్పావుట. పోనీలే ఎవరికి చెప్తేనేం నీ కడుపున ఒక మగ నలుసు పుడితే వంశోద్ధారకుడు వుంటాడు మీకు—" అని ఏదో చెప్పుకుపోతోంది.

చెప్పద్దూ నాకు అసలు విషయం బోధపడటం లేదు.

"ఏమిటే నీ వాగుడు ఈసారైనా మగపిల్లాడు అంటావ్" అన్నాను విసుగ్గా.

"ప్రొద్దున్న బామ్మగారితో నీళ్ళోసుకున్నానని చెప్పావుట. ఏం డబాయిస్తున్నావ్" అంది నవ్వుతూ పెద్దక్కయ్య.

స్నానాలుచేసి వస్తుంటే బామ్మగారు ఎదురైన సంగతి, ఆమెకు జవాబు చెప్పిన సంగతి చెప్పాను. తరువాత నేను ఆపరేషన్ చేయించుకున్న సంగతి కూడా చెప్పాను.

అసలు విషయం తెలిసాక "ఎప్పుడూ నీళ్ళోసుకున్నాను అని చెప్పకూడదు కదూ" అన్నా అక్కయ్యతో.

"స్నానం చెయ్యి తల్లీ. కానీ నీళ్ళోసుకోకు" అంది అక్కయ్య. ఇద్దరం నవ్వుకున్నాం.

"ఏంటమ్మాయిలూ నవ్వుకుంటున్నారు" అంది బామ్మగారు. ప్రక్కనే ఉన్నారామె.

"మా చెల్లాయ్ నీళ్ళోసుకుందటండి. అదే కనుక్కుంటున్నాను" అన్నాను.

"నే చెప్పలా?" అందామె.

# నిర్ణయం

—"క్రోక్విల్" నరసింహ

గుంటూరు
ఉదయం 10 గంటలు

సుధీర్ పెళ్లి చూపులకు వెళ్లాడు. మర్యాదలు అన్నీ ముగిశాక అమ్మాయిని ఏమన్నా అడుగుతావా బాబూ! అంటూ పెద్దలందరూ బయటకు వెళ్లారు. ఆ
హాల్లో ఇద్దరే మిగిలారు.

చాప మీద బొమ్మలా కూర్చున్న అమ్మాయిని ప్రశ్నించాడు సుధీర్.

మీ పేరు....

"పద్మ"...

ఎంతవరకు చదువుకున్నారు.

"పది"...

ఇంటిపని, వంటపని చేయడం వచ్చా...

"చాలా బాగా"...

"హాబీలు"

"ఉన్న దానితో తృప్తిపడటం"

???

పదిరోజుల్లో తమ నిర్ణయం తెలియచేస్తాం అని బయలుదేరారు మగపెళ్ళివారు.!!

***

గుంటూరు. సాయంత్రం 6 గం.

అదే రోజు మరో మ్యాచ్‌కి వెళ్లారు సుధీర్ వాళ్ళు.

మోడ్రన్ డ్రస్‌లోవున్న పెళ్లి కూతురు వచ్చి సుధీర్ ఎదురుగా సోఫాలో కూర్చుంది. అది గమనించి పెద్దలు బయటకు వెళ్లారు.

హల్లో! మీ పేరు చెబుతారా? అని అడిగింది మోడ్రన్ డ్రస్.

"సుధీర్"...

నెలకు ఎంత సంపాదిస్తారు

"రెండువేలు"

మా డాడి మీరడిగినంత కట్నం ఇచ్చినప్పుడు మీరు నేను కోరిన కోరికలన్ని తీరుస్తారా? మన పెళ్లయితే అని అడిగింది.

???

***

ఆ రోజు రాత్రే హైదరాబాద్ చేరుకున్న సుధీర్ మొదట తాను చూసిన అమ్మాయి నచ్చినట్లు వెంటనే ముహూర్తాలు పెట్టించమని వ్రాస్తూ కట్నకానుకలు వారి నుండి ఏమీ ఆశించవద్దని తండ్రిని కోరుతూ లెటర్ ముగించాడు—

నెల రోజుల్లో వారి పెళ్ళి వైభవంగా జరిగింది!!

# రియాలిటీ

—ఎస్. ఖదేజాని.



12 ఏప్రిల్ 1984.

అరుంధతి ఓ లావాటి కవరుని మూర్తికిచ్చింది. మూర్తి ముఖం చిట్లించాడు.

"ఏమిటిది? నీ కథలు, కావ్యాలేనా?" వెటకారం.

"ఊ"

"పోస్టు చేయాలా?"

"ఊ!"

"నే చెయ్యను. ఛస్తే దీన్ని పోస్టు చెయ్యనుగాక చెయ్యను" అరుంధతి మూర్తివైపు బేలగా చూసింది.

"ఏమండీ...."

"అవును. దీన్ని పోస్ట్ చేయాలంటే కనీసం రెండు రూపాయలన్నా అవుతుంది. ఎందుకట ఈ వృథా ఖర్చు?"

"రాత్రంతా నిద్రపోకుండా కూర్చొని మరీ రాసిన ఈ కథను పోస్టు చేయడానికయ్యే ఖర్చు వృథా ఖర్చా?" కోపం

"అక్షరాలా!"

"మీరు పేకెట్లకొద్దీ సిగరెట్లు కొనుక్కోవడానికి, జర్దాకిళ్ళీలు నవలటానికి అయ్యే ఖర్చు మాత్రం అవసరపుఖర్చు. అంతేగా?"

"చాల్లే! దానికి దీనికి ఏంటట సరిబంధం?"

"ప్లీజండీ! కథల పోటీకి పంపించడానికి రాసింది. ఇంకో రెండ్రోజులే టైముంది?" అరుంధతి తిరిగి అర్థింపులోకి జారింది.

"చెప్తే అర్థం చేసుకోవేం? డబ్బుల్లేవు"

"మరీ అన్యాయంగా మాట్లాడకండి. రెండ్రూపాయలు కూడా లేవా?"

"ఉన్నాయనుకో, అయితే ఈ పిచ్చికథ కోసం వాటిని ఖర్చు చేయటమెందుకూ? అని"

"అలా మాట్లాడమాకండి. నాక్కోపం వస్తుంది"

"లేకపోతే ఏంటట? దస్తాల కొద్దీ తెల్ల కాగితాలు, బుడ్డకొదీ సిరా, ఎంత పోస్టేజీ... అమ్మమ్మమ్మ.. ఏం నచ్చలా నీ పద్ధతి!"

"ఏవండీ! మీ ఆఫీసుకు టైమవుతుంది"